క్లుప్తంగా

అంజన్నకు అభిషేకం


అలంకరణలో అంజన్న

బొమ్మనహాళ్: ప్రసద్ధి చెందిన నేమకల్లు అంజన్నఆలయంలో శనివారం అభిషేకం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కాగా మానవ హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు బి.ఎస్ కృష్ణ, ఉమ్మడి జిల్లాల జోనల్ కన్వీనర్ నాగార్జున, బొమ్మనహాళ్ ప్రెసిడెంట్ హరేసముద్రం రాముడు, వైస్ ప్రెసిడెంట్ శంకర్ తదితరులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఎమ్మెల్సీకి పరామర్శ


ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల గ్రామంలో శనివారం ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని కర్నూలు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పరామర్శించారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి వై.ఉమాదేవి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విషయం విదితమే. శనివారం కర్నూలు జిల్లాకు చెందిన కోట్ల సుజాతమ్మ కొనకొండ్ల గ్రామానికి చేరుకుని ఎమ్మెల్సీతో పాటు కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

'జీబీసీకి నీరు విడుదల చేయాలి'

విడపనకల్లు: గుంతకల్లు బ్రాంచి కెనాల్ (జీబీసీ)కు సాగునీరు విడుదల చేయాలని రైతులు శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. జీబీసీకి సాగునీరు బంద్ కావడంతో పంటలన్నీ ఎండి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం 42వ జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. అధికారులు వారికి సర్ది చెప్పి ధర్నా విరమింపజేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



పాడె మోస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

కణేకల్లు: మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మనప్పాచారి (45) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్‌సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి శనివారం గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. మనప్పాచారి మృతి తమకెంతో బాధకల్గించిందని కాపు దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో సర్పంచు వన్నప్ప, మాజీ సర్పంచు లోకేష్‌గౌడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జున, సురేష్‌రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి చిత్తయ్య, పాతప్ప జాతర

కుందుర్పి: మండలంలోని మహంతపురం గ్రామంలో 30 ఏళ్ల తరువాత ఈ నెల 18 నుంచి పాతప్ప జాతర ఉత్సవాలు నిర్వహించనున్నారు. వారం రోజులుగా సర్పంచ్ జగన్, పంచాయతీ అధికారులు జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం ఈరన్న స్వామి, చిత్తయ్య గ్రామోత్సవం, అదే రోజు సాయంత్రం ఆంజనేయస్వామికి పానకం బండ్లతో ఉత్సవం ఉంటుందన్నారు. మంగళవారం ఉదయం పాతప్ప స్వామి గ్రామోత్సవం సాయంత్రం గ్రామశాంతి, బుధవారం ఉదయం గావుల కార్యక్రమం, గ్రామోత్సవం మహామంగళ హారతితో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు సర్పంచ్ జగన్ తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్, ఆర్డీటీ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు అరికట్టడంలో భాగంగా 'పది తరువాత పెళ్లి కాదు.. పదకొండు' అనే కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ లక్ష్మీప్రసన్న ,ఆర్డీటీ టీం లీడర్ ఆదినారాయణ మాట్లాడుతూ బాల్యవివాహాలు అరికట్టడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఎవరైనా బాల్య వివాహాలకు ప్రయత్నించినా, సహకరించినా జైలు శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కాసీంబీ, రామాంజనమ్మ, ఆర్డీటీ సీఓ రామకృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రారంభమైన వరి కోతలు

- హెచ్చెల్సీ ఆయకట్టులో బిజీగా రైతులు
- దిగుబడులపై అన్నదాతల ఆనందం


కణేకల్లులో వరి పంటను కోస్తున్న యంత్రం


ట్రాక్టర్‌లో వరిధాన్యాన్ని వేస్తున్న దృశ్యం

కణేకల్లు: హెచ్చెల్సీ ఆయకట్టు ప్రాంతాలైన కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. వర్షాభావ పరిస్థితులు ... టీబీ డ్యాంలో తగినంత నీటి లభ్యత లేకపోవడం..... వంటసాగు కష్టమైన తరుణంలో విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రత్యేక్షమైన చర్యలు తీసుకుని పంట చివరి వరకు సాగునీరందించేలా చూడటంతో ఆయకట్టు రైతులు గట్టెక్కారు. కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ పరిధిలో కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హిరేహాళ్, విడపనకల్లు ప్రాంతాల్లో 35 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. రైతులు ఎక్కువగా వరిసాగు చేశారు. ప్రధానంగా బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్, గంగాకావేరి రకం వరి పంటను రైతులు పండించారు. కణేకల్లు, 43 ఉడేగోళం, గంగలాపురం, తదితర గ్రామాల్లో వరి పంటలు చేతికి రావడంతో రైతులు వరికోతలను ప్రారంభించారు.

వరికోత యంత్రాలకు భారీ డిమాండ్

కర్ణాటకలోని బళ్లారి, హోస్పేట జిల్లాల్లోని వివిధ ప్రాంతాలతోపాటు కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో ఒకేసారి రైతులు వరినాట్లు వేయడంతో పంటంతా ప్రస్తుతం చేతికొచ్చింది. దీంతో వరికోతలు ఒకేసారి ప్రారంభం కావడంతో యంత్రాలకు భారీ డిమాండ్ వచ్చింది. వరికోతలకు యంత్రాలు దొరకని పరిస్థితి నెలకొంది. వరికోత గంటకు రూ.2,600 తీసుకొంటున్నారు. రైతుల అవసరాన్ని బట్టి కొందరు దళారులు వంద రూపాయలు ఎక్కువగా తీసుకొంటున్నారు. మరో వైపు కూలీలకు కూడా డిమాండ్ పెరిగింది. ఎకరా విస్తీర్ణంలో వరి కోత కోసి కుప్ప వేయడానికి కూలీలకు రూ. 5 వేల వరకు అవుతుంది. పశువుల మేత కోసం వరిగడ్డికి డిమాండ్ ఉండటంతో పలువురు రైతులు కూలీలతో వరికోత చేయిస్తున్నారు.

ఆయకట్టు రైతులకు అండగా జగనన్న సర్కారు

హెచ్చెల్సీ ఆయకట్టు రైతులకు జగనన్న సర్కారు అండగా నిలిచింది. ఈ ఏడాది తుంగభద్ర నదిపరివాహక ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు నెలకొని డ్యామ్‌లో నీటి లభ్యత గణనీయంగా పడింది. జిల్లాకు వరప్రదాయిని అయిన హెచ్చెల్సీ ద్వారా ఓ వైపు తాగునీటి అవసరాలతోపాటు మరో వైపు ఆయకట్టులో పంటల సాగుకు నీరివ్వడం చాలా కష్టతరంగా మారింది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాలో తాగునీటి అవసరాలకు సరిపడ నీరును పీఏబీఆర్ డ్యాం తోపాటు పలు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుల్లో నీరును నిల్వ చేయించింది. అంతేకాక రైతులకు సైతం అండగా నిలిచింది. అత్యంత గడ్డు పరిస్థితుల్లోను హెచ్చెల్సీ ద్వారా 16 టీఎంసీల నీరును డ్రా చేసి రైతులకు సైతం న్యాయం చేయగలిగింది.

ఎకరాకు 45 నుంచి 48 బస్తాలు

హెచ్చెల్సీ ఆయకట్టులో వరి దిగుబడి సైతం బాగా వచ్చింది. గతంలో ఎకరాకు 40 బస్తాల వరకూ దిగుబడి వచ్చేది. ఈ సారి 45 నుండి 48 బస్తాల వరకు కూడా దిగుబడి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దిగుబడులు ఆశాజనంగా ఉండటంతో రైతులతోపాటు కౌలు రైతులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మార్కెట్‌లో క్వింటాలు వరి ధాన్యం రూ.2,900 నుంచి రూ.3,000 వరకూ ఉంది. గత 20 ఏళ్లలో ఇంతటి ధరలు చూడలేదని రైతులు సంబరపడుతున్నారు.

ఈ ధరలు ఎప్పుడూ చూడలేదు



ఐదు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. ఎకరానికి 45 బస్తాల దిగుబడి వచ్చింది. గతంలో కంటే దిగుబడి బాగా వచ్చింది. క్వింటాలు వరిధాన్యం రూ.2,900తో విక్రయించాను. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలు వరి ధాన్యం రూ.3వేలు ఉంది. ఈ ధరలు ఎప్పుడూ చూడలేదు. చాలా ఏళ్ల తర్వాత వరికి గిట్టుబాటు ధరలు రావడంతో రైతులకు అదనపు లాభాలు వచ్చాయి.

ఆనందరెడ్డి, రైతు, కణేకల్లు

అధైర్య పడకండి..అండగా ఉంటా

కూడేరు: 'అధైర్యపడకండి.. అండగా ఉంటానని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దామోదర్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. శనివారం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణారెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆశాలత, ఎంపీపీ నారాయణరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు సర్దార్‌వలి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నాగిరెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి మోడల్ పేపర్ విడుదల


మోడల్ పేపర్ విడుదల చేస్తున్న ఎంఈఓలు

బొమ్మనహాళ్: పదో తరగతి పరీక్షల్లో ఉపయోగపడే మోడల్ పేపర్‌ను శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఎంఈఓలు వీరన్న, మల్లికార్జున, ప్రధానోపాధ్యాయుడు రాజ్‌కుమార్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజు మాట్లాడుతూ విద్యార్థులకు ఈ మోడల్ పేపర్ ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆంజినేయులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి మరింత కృషి


క్రిస్టియన్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయిస్తూ ఇచ్చిన తీర్మాన ప్రతిని అసోసియేషన్ సభ్యులకు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, పార్టీ ప్రజాప్రతినిధులు

ఉరవకొండ: నియోజకవర్గంలో క్రైస్తవుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నానని, వారి అభ్యున్నతికి మరింత కృషి చేస్తామని ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక డ్రైవర్స్ కాలనీలో మేజర్ పంచాయతీకి చెందిన 12 సెంట్ల స్థలాన్ని ఉరవకొండ నియోజకవర్గంలోని క్రైస్తవుల శుభకార్యాలు నిర్వహించుకోవడానికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆదేశాలతో కేటాయించడాన్ని హర్షిస్తూ క్రైస్ట్ క్రిస్టియన్ వెల్‌ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రైస్తవుల కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం పంచాయతీ ద్వారా స్థలం మంజూరు చేయించడం గర్వంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రైస్తవులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. అనంతరం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మాజీ ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 12 సెంట్ల స్థలం కేటాయిస్తూ పంచాయతీ తీర్మానం చేసిన కాపీని సర్పంచ్ లలితమ్మ, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మతో కలసి మాజీ ఎమ్మెల్యే అసోసియేషన్ సభ్యులకు అందించారు. అనంతరం క్రిస్మస్‌ను పురస్కరించుకుని ముందస్తుగా చర్చి పాస్టర్లు, పార్టీ ప్రజాప్రతినిధులతో కలసి ఆయన కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, మాజీ ఎంపీపీ చంద్రమ్మ, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, ఈఓ గౌస్‌సాహెబ్, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరోగ్యనాథన్, ఉపాధ్యక్షుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక లక్ష్మీనృసింహస్వామి కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మాజీ ఎమ్మెల్యే పరిశీలించారు. ఈసందర్భంగా సర్పంచ్ లలితమ్మతో కలసి ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మేజర్ పంచాయతీ పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రహదారులు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఇందులో ఒక్క డ్రైవర్స్‌కాలనీకే రూ1.5 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు బసవరాజు, పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, మాజీ ఎంపీపీ చంద్రమ్మ, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

గుమ్మఘట్ట: మండలంలోని బేలోడు గ్రామంలో ఆంజనేయస్వామి రథోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, పుష్పాలంకరణ, మహామంగళహారతి చేపట్టారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాన్ని అడ్డపల్లకిలో తీసుకువచ్చి రథంలో కొలువుదీర్చి డప్పులు, మేళతాళాలు, ఊరాల నడుమ ఊరేగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాన్ని తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వారు రథోత్సవం ప్రారంభించారు. రథం ముందుభాగంలో యువకులు నందికోళ్లతో నృత్యం చేయగా, చిన్నారులు కలశాలను పట్టారు. వీరభద్ర వేషధారణలో చేసిన నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సర్పంచ్ ఉమేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ భవాని, సింగేపల్లి శివసాయిబాబా, వైస్ సర్పంచ్ రామాంజనేయులు, నాయకులు జయరామిరెడ్డి, బేలోడు రామాంజనేయులు, ఖాసిం, తలారి శాంతేష్, బొమ్మయ్య, పాండురంగారెడ్డి, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం


మాట్లాడుతున్న ఈఓఆర్డీ మాధవరెడ్డి

బెళుగుప్ప: కేంద్ర ప్రభుత్వ పథకాలతో గ్రామాల్లో పూర్తిస్థాయి మౌలిక వసతులను ఏర్పాటు చేయడమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర లక్ష్యమని ఈఓఆర్డీ మాధవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బెళుగుప్ప, ఎర్రగుడి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈఓఆర్డీ మాట్లాడుతూ గ్రామీణులకు అవసరమైన ఆరోగ్య వసతులు, పారిశుధ్య సౌకర్యాలు కల్పించడంతో పాటుగా పక్కా గృహాలు, విద్యుత్ సదుపాయం, నాణ్యమైన విద్యా సేవలను అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నక్కలపల్లి సర్పంచ్ రామిరెడ్డి, వైద్యాధికారి రుషికేష్, ఎంఈఓ-2 హరికృష్ణ, ఎర్రగుడి ఉప సర్పంచ్ వన్నూర్‌సాబ్, అధికారులు పాల్గొన్నారు.

హంద్రీనీవా నీరు జీబీసీకి మళ్లించండి


రైతులతో కలసి కెనాల్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

విడపనకల్లు: హంద్రీనీవా నీటిని జీబీసీకి మళ్లించేందుకు హంద్రీనీవా కెనాల్‌ను ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి రైతులతో కలసి శుక్రవారం పరిశీలించారు. జీబీసీ కింద సాగుచేసిన పంటలను కాపాడేందుకు హంద్రీనీవా నీరును జీబీసీకి మళ్లించేందుకు ఇంద్రావతి వద్ద హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీను,హెచ్చెల్సీ జీరోబై జీరో కిలో మీటర్ వద్ద ఆయన పరిశీలించారు. హంద్రీనీవా నీటిని జీబీసీకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. టీడీపీ నాయకులు ఉద్దేశ పూర్వకంగా ధర్నాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, పార్టీ మండల కన్వీనర్ బసన్న, మాజీ సర్పంచు భీంరెడ్డి, నాయకులు గాజుల వెంకటేశులు, మేకల రామాంజనేయులు, డిష్ వెంకటేశులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న రాజకీయ వేడి

- 'జగన్ సంక్షేమ పథకాలకే జై కొడుతున్న జనం
- టీడీపీకి ఘోర ఓటమి తప్పదంటున్న ప్రజలు
- సర్వేల్లోనూ టీడీపీ వెనుకంజ!
- అభ్యర్థుల మార్పుపై టీడీపీ దృష్టి

రాయదుర్గం: శాసనసభ ఎన్నికలు దగ్గరపడుతున్నాయి.. ఈ నేపథ్యంలో సర్వేలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ప్రజల మదిలో ఎవరున్నారు..? వారి అభిప్రాయం ఎలా ఉంది..? తెలుసుకోవటానికి పలు సర్వే సంస్థలు గత కొంతకాలంగా జల్లెడ పడుతున్నాయి. పల్లె, పట్టణాల్లో ఏ పార్టీ బలం ఉంది. అభ్యర్థి ఎవరైతే బాగుంటుంది..? అనుకూల, ప్రతికూల పరిస్థితుల పై నివేదికలు సిద్ధం చేస్తున్నాయి. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజక వర్గాల్లో ప్రధాన పార్టీలన్నీ సర్వే బాట పట్టాయి. ఈ నేపథ్యంలో గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా రాజకీయ వేడి ఊపందుకుంది.

ఫ్యాన్ ప్రభంజనం తథ్యం

రాష్ట్రంలో ఇప్పటి వరకూ జరిగిన సర్వే ఫలితాలన్నీ జగన్ సంక్షేమ పథకాలకే జనం జైకొట్టారు. తాజాగా టైమ్స్ నౌ సర్వేలోనూ ప్రతిపక్షాలకు గూబ గుయ్ మనిపించేలా ప్రజలు తీర్పునిచ్చారు. 25 పార్లమెంట్ స్థానాలు ఉంటే, అందులో 24 చోట్ల ఫ్యాన్ ప్రభంజనం తథ్యమని తేల్చారు. దీంతో టీడీపీ శ్రేణుల్లో నైరాశ్యం కనిపిస్తోంది. గడిచిన 2019 అసెంబ్లీ ఎన్నికల్లోనూ రాయదుర్గం, కళ్యాణదుర్గంలో టీడీపీ ఘెర ఓటమి చవిచూసింది. హేమాహేమీలుగా చెప్పుకునే కాలవ శ్రీనివాసులు, ఉమామహేశ్వరనాయుడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కాపు రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్ చేతిలో వేల ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. ఉరవకొండలో స్వల్ప ఓట్లతో పయ్యావుల కేశవ్ గట్టెక్కారు. ఆ తర్వాత జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ టీడీపీ ప్రజల చేతిలో చావుదెబ్బతింది. గ్రామ పంచాయతీ నుంచి ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో టీడీపీ సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. తాజా సర్వే ఫలితాలు ఆ పార్టీని మరింత కుంగదీసేలా కనిపిస్తోంది. టీడీపీ జరిపిన సర్వేల్లోనూ వెనుకంజే కనిపించడం ఆందోళన కలిగించే అంశమని ఆ పార్టీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

అభ్యర్థుల మార్పుపై జోరుగా చర్చ

రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థుల మార్పుపై ప్రజల్లో జోరుగా చర్చ సాగుతుంది. రాయదుర్గంలో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన మాజీ జెడ్పీ చైర్మన్ పూల నాగరాజు ఓ వైపు టిక్కెట్టు కోసం పట్టువీడని విక్కమార్కుడిలా పోరాటం చేస్తున్నారు. మరోవైపు 2014 వరకూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి కేవలం 20 రోజుల వ్యవధిలో కాలవకు అప్పగించి తప్పుకోవాల్సి వచ్చిందని మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి పార్టీ వర్గాల వద్ద వాపోతున్నారు. 2024లో మళ్లీ తనకే టిక్కెట్టు ఇవ్వాలని లేని పక్షంలో స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో నిలుస్తాననే అల్టిమేటం పార్టీకి పంపినట్టు విశ్వసనీయ సమాచారం. ఇటీవల వీరిద్దరూ పార్టీ అధినేత చంద్రబాబును కలుసుకోవడంతో రాజకీయం రసకందాయంగా మారింది. టిక్కెట్ ఎవరికి వస్తుందోనని శ్రేణుల్లో సందిగ్ధత నెలకొంది. కళ్యాణదుర్గంలోనూ ఉమా, ఉన్నం వర్గాల మధ్య విభేదాలు తార స్థాయికి చేరుకున్నాయి. ఈ కారణంగా వచ్చే ఎన్నికల్లో టీడీపీ సింగిల్ డిజిట్‌కే పరిమితం కాక తప్పదని ప్రజలు భావిస్తున్నారు. ఉరవకొండలో పయ్యావుల కేశవ్‌ను 2019లో ఎమ్మెల్యేగా గెలిపించుకున్నా, ప్రజా సమస్యలు గాలికి వదిలేసి చుట్టపుచూపుగా వస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా మూడు నియోజకవర్గాల్లోనూ టీడీపీ మూడు ముక్కల పరిస్థితి ఎదుర్కొంటోంది. ఏదిఏమైనా జగన్ ప్రభంజనం ముందు టీడీపీ నిలవడం, గెలవడం కష్టమేనని అటు ప్రజలు, ఇటు సర్వే సంస్థలు ఘంటాపథంగా చెబుతున్నాయి.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం


అష్టోత్తర అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: పట్టణంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్టి, కల్యాణోత్సవంలో భాగంగా శనివారం మూలవిరాట్‌కు 108 పచ్చి టెంకాయలతో అష్టోత్తర అభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి విశేష పూజలు, అభిషేకాల అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణహోమంతో పాటు వందలాదిమంది భక్తుల నడుమ సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం, మహామంగళహారతి కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ అంగదాల కృష్ణయ్య, చైర్మన్ ఎంసీ కరిబసి, కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకుడు దివాకరశర్మ పాల్గొన్నారు.

వైభవంగా సుగ్గమ్మదేవి ఉత్సవాలు


గోమాతకు పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ

రాయదుర్గం(డి హీరేహాళ్): డి హీరేహాళ్ మండలంలోని సిద్దాపురంలో సుగ్గమ్మదేవి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం వేకువ జామున విగ్రహ ప్రతిష్టాపన, కలశ స్థాపన, నూతన ఆలయం ప్రారంభోత్సవం తదితర కార్యక్రమాలు వేద పండితుల మధ్య చేపట్టనున్నట్లు ఎంపీపీ ఎం పవిత్ర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి తెలిపారు. ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ విప్ దంపతులు కాపు రామచంద్రారెడ్డి, కాపు భారతి రూ.4.01 లక్షల విరాళం అందించారని గుర్తుచేశారు. ఈ పుణ్య కార్యక్రమం వారి చేతులమీదుగా నిర్వహిస్తామన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ రంగనాయకులు

రాయదుర్గం రూరల్: సభ్యులు లేవనెత్తిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ విద్యావతి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన శనివారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారిగా మండలస్థాయి అధికారులు ప్రగతి నివేదికలను వివరించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు హౌసింగ్ , విద్యాశాఖ, ఉద్యానశాఖ, తాగునీరు, శానిటేషన్ సమస్యలపై ఆయా శాఖల అధికారుల దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. ఎంపీపీ విద్యావతి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నా, అధికారుల నిర్లక్ష్యం వల్ల సమావేశాల్లో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వచ్చే సమావేశం నిర్వహణలోగా సభ్యులు సభ దృష్టికి తెచ్చిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రంగనాయకులు, ఎంఈఓ-2 వెంకటరమేష్ , ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, ఏఓ మహేంద్ర, హౌసింగ్ ఏఈ అనిల్ కుమా, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు , కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

జనార్దన వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు



వజ్రకరూరు: మండల కేంద్రంలోని జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు, అలంకరణ, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వి నియోగం తదితర కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం కూడా విశేష పూజలు నిర్వహించారు. స్థానికులతోపాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. ఈఓ అంగదాల క్రిష్ణయ్య, అర్చకుడు నరసింహమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

రేపు అక్కమ్మ దేవతల విగ్రహ ప్రతిష్ట

కూడేరు: మండలంలోని ఆరవకూరులో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం అక్కమ్మ దేవతల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఆదివారం నవ గ్రహ క్షేత్ర పాలక కలశారాధన, మూలమంత్ర హోమం నిర్వహిస్తామన్నారు. భక్తులు, గ్రామస్తులు ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.